వచ్చిన బస్సును ఆపుచేసి పట్టణంవెళ్ళి, అక్కడ దిగి కాలినడకతో గబగబా కలెక్టరు ఆఫీసువైపు నడవ సాగాడు.

ఆ నడకలో ఏవో ఊహించుకొని, ఊహలోపడి రోడ్డుకు అడ్డంగావచ్చాడు. వెంటనే వెనుకనుంచి స్పీడుగా వస్తూన్న కలెక్టరుగారమ్మాయి కారు వీర్రాజుని గుద్దింది. కారు చెక్ వీల్ క్రిందపడిన వీర్రాజుకి యాక్సిడెంటులో ఎడమకాలు విరిగింది. వెంటలో ఆస్పత్రిలో చేర్పించారు. 'అపాయంలేదని' కలెక్టరుగారమ్మాయిలో డాక్టరుగారు చెప్పేరు. అపుడు కలెక్టరుగారమ్మాయి తండ్రిగారికి యీ విషయము ఫోన్ చేసింది.

ఇంటర్వ్యూ అయిపోగానే కలెక్టరుగారు పి.ఎ. తో ఆస్పత్రికి వచ్చేరు. వీర్రాజుని పలకరించారు. వీర్రాజు కారుక్రిందపడి కాలు విరగొట్టికొన్నందుకు బాధపడలేదు. తన కుటుంబ పరిస్థితి, తన పరిస్థితి అంతా చెప్పి తప్పకుండా ఉద్యోగం యిప్పించవలసినదిగా కలెక్టరుగారిని ప్రాథేయపడ్డాడు. అందుకు కలెక్టరు "డోంట్ వర్రీ వీర్రాజు, ఐ విల్ ట్రై" అని చెప్పి వెళ్ళిపోయాడు. వీర్రాజు ఆరోగ్యం చేకూరింది. కాని కలెక్టరు దగ్గర నుంచి ఏవిషయము తెలియలేదు. డిస్చార్జి చేసేస్తామని డాక్టరు చెప్పేసి వెళ్ళిపోయాడు.

అంతలో పి.ఎ. వచ్చి ఐదొందలు రూపాయిలున్న కవరు వీర్రాజు చేతిలోపెట్టేడు. "మిస్టర్! వీర్రాజు! ఈడబ్బు తీసికొని నీ వూరెళ్ళి ఏదైనా చిన్న దుకాణం పెట్టుకో! కలెక్టరుగారు అవకాశం చిక్కినపుడు జాబు సేయిస్తానన్నారు"

ఆమాటలు విన్న వీర్రాజుకి షాక్ తగిలినట్లుంది. భూమి గుండ్రంగా ఒక్కమారు తిరిగినట్లయింది. మొదలు నరికిన మ్రానులా నొక్కసారిగా బెడ్‌మీద పడిపోయాడు.

---

''కథాంజలి''లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ బాద్యులుకాదు. —సంపాదకుడు.

---

# ★ ఎదురిల్లు ★

* రచన: వి. విజయలక్ష్మి. *

అప్పుడే తలుపుపై 'దబదబ' శబ్దంతోపాటు గాజుల 'గలగల' సమ్మిళితమైన అపరిచిత గొంతుకను విని నిద్రవచ్చీరాని కళ్ళతో విసురుగావెళ్ళి తలుపు తెరిచింది ఊర్మిళ.

ఎవరో అపరిచితురాలు ఆకుపచ్చని వొంటి పొర చీర లోపలినుండి మిలమిల మెరుస్తున్న జంట మంగళ సూత్రలు ట్యూబులైటు కాంతిలో మెరుస్తున్నాయి ఊర్మిళ కళ్ళకు. "ఏమండీ! నిద్రలో ఉన్నట్లున్నారు" అంది వచ్చినావిడ. ఊర్మిళ అరమోడ్పుగా వాలిఉన్న కళ్ళను చూచి, ఇన్ని ఇళ్ళు పిలిచేటప్పటికి ఇంత ఆలస్యం అయిందని, తన ఆలస్యాన్ని తెలియజేసింది బొట్టుపెడుతూ.

"లేదండీ! ఇప్పుడే పడుకున్నాను" అంది. వచ్చినావిడ ఎవరూ—అని మనసులో అనుకుంటూ ఊర్మిళ. "ఏమండీ! మేం రాత్రికి మీ ఎదురింటిలో దిగుతున్నాం! తప్పక రండీ!" అంటూ, దారితీసింది వచ్చినంత సేపు కూడ వుండకుండా మెఱుపులా.

అలా వచ్చి వెళ్ళిపోతున్న ఆమెను వీధివరకూ వెళ్ళి చూస్తూ నిలబడింది ఊర్మిళ.

కనకాంబరాలు, మల్లెపువ్వులూ కలిపి తురుముకుంది ఆవిడ. తలలో ఆకుపచ్చ చీరలో అవయవ సౌష్ఠవం చూస్తున్నవారిని మంత్రముగ్ధుని చేస్తుంది. ఇదే ఆలోచిస్తూ తిరిగివచ్చిన ఊర్మిళ మంచంమీద మేనువాల్చింది.

తెలుపు దుప్పటి పరచిన 'డన్‌లప్' పరుపుపై ఫుల్ వాయిల్ నల్లచీర, అదేరంగు జాకెట్టు వేసుకొని ఆలోచనగా అటుతిరిగి పడుకున్నది ఊర్మిళ. ఆయన ఇచ్చిన మల్లెదండ, ఆ గదినంతనూ గుబాళింపచేసి నిదుర రాని ఊర్మిళను విడువలేక వాడిపోవడానికి సిద్ధపడిన మల్లెదండను వాసనచూస్తూ అబ్బ! ఎంత సువాసనో, అని అఘ్రాణించింది మైమరచి ఊర్మిళ.

ఫుల్ స్పీడులో గిఱ్ఱున చిన్నశబ్దంచేస్తూ, నిశ్శబ్దాన్ని భంగంచేస్తూ తిరుగుతున్నది, సీలింగ్ ఫేన్, గది తలుపులు బంధింపబడివున్నది అయినా తలుపు సందులనుండి ఊర్మిళ పడుకున్న తీరుచూచి చల్లగాలి నెమ్మదిగా బుగ్గలను తాకిపోయింది రివ్వున.

మబ్బులు చాటువస్తే, చంద్రుడు తొంగితొంగి చూస్తూ తనివితీరా తన వెన్నలను పూర్తిగా కిటికిగుండా ఊర్మిళమీదకు ప్రసరింపజేసాడు చంద్రుడు.

ఇదిచూచి చెదరిన ముంగురులు విశాలమైన నుదుటిపై నాట్యంచేస్తుండగా, అలా అర్ధనిమీలిత నేత్రాలతో నిదురలోనికి జారుకుంది అప్పుడే__ఊర్మిళ.

తెల్లవారింది రాత్రి ఎదురింటిలో దిగింది ఎవరోలే! ఎవరైతే మనకేం అనుకుంది మనసులో ఊర్మిళ.

వీధి వరండాలో వారగా వేసివున్న 'గాడ్రెజ్' కుర్చీలో కూర్చునివుంది ఊర్మిళ, ఎవ్వరూ కనపడనిగా ఎదురింటివైపు చూస్తూ__

గాలికి కదులుతున్న కొబ్బరాకులను, ఆ ఆకులమీదే ప్రక్కనున్న నీరేడు చెట్టు ఆకులనుచూస్తూ కూర్చుంది ఊర్మిళ. నీరెండకు తళతళ మెరుస్తున్న నీరేడు చూస్తూ ఆలోచనల్లో పడింది__

★ ★ ★

మూడు సంవత్సరాలక్రింద... కాలేజీలోకూడ నీరేడు చెట్టు ఉండేది. రాలిన నీరేడు పండ్లను ఏరుకుంటూ, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, బుద్ధిగా చదువుకుంటూ ..ఆ కాలేజీరోజులు గుర్తురాగా గతంలోకి నిమగ్నమైంది ఊర్మిళ.

అల్లరి 'రమేష్' జ్ఞాపకానికివచ్చాడు, ఆ స్తమానూ అమ్మాయిల్ని ఏడిపిస్తూ అల్లరి చిల్లరిగా తిరిగి పెద్ద 'హీరో'లా పోజుపెట్టి, సన్నని మీసాలు, సైడ్ లాక్స్, చెదరిన జుట్టు, నుదుటిపై పడినప్పుడు ఎప్పుడూ పైకి తీసుకొని రమేష్. పువ్వుల షర్ టౌతో ఎప్పుడూ ఉల్లాసంగా తిరుగుతూ, ఒక్కనాడుకూడ సరిగ్గా క్లాస్కు హాజరుకాక కనబడిన అమ్మాయిల దగ్గరకువెళ్ళి, తెలిసినా తెలియక పోయినా ఏ నోట్సో, పెన్నో కావాలని అరువు తీసుకుని అలాఅలా అమ్మాయిల చుట్టూ సైకిల్పై ఒక్క రౌండ్ చుట్టి టూ...టూ...అంటూ సైకిల్ బెల్ మ్రోగించుకుంటూపోతున్న రమేష్నుచూచి, ఏమీ చెయ్యలేక అమ్మాయిలు 'హూ' అనుకుంటూ క్లాస్కుపోయేవారు

క్రొత్తగా కాలేజీలో చేరిన ఊర్మిళకు ఇదంతా చూస్తుంటే మనస్సు భయంతో నిండిపోయేది. ఇంత మంది అబ్బాయిలను చూస్తుంటే హడలిపోయేది. తన స్నేహితురాలు యశోదకు కొంచెం ధైర్యం ఎక్కువ, ఇంకా 'థర్డ్ బెల్' అవ్వలేదని అలా చెట్టుక్రింద కూర్చుంది ఊర్మిళ, యశోద ఆరోజు రాలేదు.

తెరచివున్న 'కాలేజీ' గేటులోనుండి అప్పుడే వస్తున్న అమ్మాయిలు, అబ్బాయిలను 'ఆకర్షించే'లాగ రంగురంగుల కోకలతో, 'సీతాకోకచిలుక' ల్లాగ కాలేజీ 'ఆవరణం'లో చూస్తూండగానే కలర్ ఫుల్ గా మారిపోయింది. అంతకుముందునుండి 'ట్రిమ్' గా తయారయ్యి, తననే చూస్తున్న రమేష్నుచూచీ, చూడగానే ఠక్కున గుండె ఆగిపోయిందనుకుంది ఊర్మిళ. తడబడు నడకలతో గబగబా నడుచుకుంటూ వెళ్ళింది, క్లాస్ రూంకి. ఆవేళ యశోద రానందుకు తన మనస్సులో తిట్టుకుంటూ, క్రొత్త అమ్మాయిలదగ్గర కూర్చోంది ఊర్మిళ.

కావాలనే తన వెనుక కూర్చున్నాడు రమేష్. నవ్విస్తూ, 'జోక్స్' వేస్తూ, లెక్చరర్ చూడకుండా అల్లరిచేస్తూ, అమ్మాయిలు వినాలని ఇంకొంచెం గట్టిగా కూతలుకూస్తూ ఏమీ ఎరుగనట్లు, ఏమన్నా! 'ఆఫ్టరాల్' అనుకుని ఆనందిస్తున్నారు ఫ్రెండ్సందరూ రమేష్తో పాటు. ఆరోజు లెక్చరర్ చెప్పిన పాఠాలు ఒకరికీ బుఱ్ఱకెక్కలేదు, ఎలాగోల క్రొత్త అమ్మాయిల్తో ఆరోజు జడుస్తూనే, కంగారుగానే క్లాస్ అయిందనిపించుకుంది

“ఏం! పాపా, ప్రక్కబేబీ రాలేదేం? ఈరోజు నేను రానా నీకు సాయం” అంటూ, అలా చూస్తుండగానే అంతకుముందే పందెం వేసుకున్నందున గేటుదగ్గర సైకిల్ అడ్డంపెట్టాడు వెళ్ళనివ్వకుండ రమేష్. ఎటూ వెళ్ళడానికి వీలులేక, సైకిల్ అడ్డపెట్టి ఉండడంతో ఊర్మిళ అదిరే గుండెలో, అమాంతగా ధైర్యంగా, సైకిల్ని తోసెయ్యబోయిన ఊర్మిళ చెయ్యను, రమేష్పట్టి, పట్టుకోకుండానే 'రమేష్' చెంప ఛెళ్ళుమనిపించింది ఊర్మిళ.

చెంపకొచ్చిన చెయ్యితీసుకునేలోపునే చకచక పుస్తకాలతో నడిచి వెళ్తున్న ఊర్మిళను ఇంత 'పొగరా' అని ఉన్నపాటున ఎలావున్నా, చెంపని 'ముద్దు' పెట్టుకుని తీరిందన్నట్లు తిరిగివెళ్ళుతున్న రమేష్‌ను చూచి, అసహ్యం, ఆత్మాభిమానం అడ్డురాగా 'ఛీ' అనుకుని దుఃఖంతో కళ్ళనుండి నీళ్ళు ఏకధారగా వస్తుండేది. ఎదురుగావస్తు రిక్షాయెక్కి కూర్చుంది కన్నీటితో ఊర్మిళ. మరునాడు కాలేజీకి వెళ్ళకపోతే రమేష్‌కి మరీలోకువగా ఉంటుందని, మనసులో బెంగవున్నా పైకి మాత్రం ఏమీ తెలియనట్లు బయలుదేరింది, ఈ సంగతి మాత్రం యశోదకు చెప్పింది, ఇద్దరూ కలసి 'ప్రిన్సిపాల్'కు జరిగింది చెప్పారు. ఆనాటినుండి కాలేజికి రాకుండాచేశారు రమేష్‌ను. క్లాసుకు రావద్దన్నారుగాని, ఆవరణలోనికి వెళ్ళడానికేం? అని కావాలని ఊర్మిళగురించి రోజూ వెళ్ళేవాడు రమేష్.

"రమేష్ రానిక్లాసులు మనకెందుకోయ్ బ్రదర్!" అంటూ అందరూ కలసిమెలిసి ఉన్న ఫ్రెండ్సంతా అసలు వెళ్ళేవారుకారు. అలా చెట్లక్రింద, చెట్లమీద కోతుల్లా, గోడలమీద పిల్లిలా, అక్కడక్కడా రోమియోల్లా గడిపేవారు చదువుకోకుండా సరదాగా. బుద్ధిమంతులుగావున్నవాళ్ళు క్లాసుకు వెళ్ళేవారు, ఈ అల్లరి అబ్బాయిలు అలాఅలా తిరుగుతూ ఎంజాయి చేసేవారు.

రమేష్ జ్ఞాపకానికివచ్చినప్పుడు ఎక్కడున్నాడో! ఏమో? అనుకుంది. ఎదురింటి తలుపులు దఢీమని తెరవడంలో తెగలేని ఆలోచనలకు అంతరాయం కలిగింది ఊర్మిళకు. రమేష్! ఆశ్చర్యం...నిజంగా 'రమేష్' వెంటనే ఆనాడు తనుకొట్టినందుకు అతని 'ముద్దు' గుర్తొంచింది, అతని వెనుకగా రాత్రి బొట్టుపెట్టిన ఆవిడ ఆకుపచ్చ చీరావిడే! ఆశ్చర్యంతో అలాచూస్తూ నిలబడిపోయింది స్థాణువులా.

భార్యకాబోలు, ఊర్మిళ మనసు గొణిగింది నెమ్మదిగా.



★

కౌముదీ పిక్చర్స్‌వారి

"ముత్యాల పల్లకి" చిత్రంలో

నారాయణరావు - జయసుధ.

★